## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- మానవ నాగరికత అభివృద్ధిలో ఖనిజాలు కీలక పాత్ర పోషించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- మహిళా సాధికారికతకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.
- మిగ్ -21 యుద్ధ విమానాలు దేశానికి గర్వకారణమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ BSNL స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4G స్టాక్‌ను రేపు ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మానవ నాగరికత అభివృద్ధిలో ఖనిజాలు కీలక పాత్ర పోషించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ప్రతిష్టాత్మకమైన జాతీయ భూ విజ్ఞాన శాస్త్ర అవార్డులు-2024ను ఆమె ఈరోజు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ, ఖనిజ సంపద పరిశ్రమలకు మూలస్తంభంగా నిలిచిందని గుర్తు చేశారు. బొగ్గు, ఇనుము లేకుండా పారిశ్రామికీకరణను ఊహించలేమన్నారు. భూ విజ్ఞాన శాస్త్రవేత్తల పాత్ర కేవలం మైనింగ్‌కు మాత్రమే పరిమితం కాదని, పర్యావరణ స్థిరత్వంపైన కూడా ఉందని చెప్పారు. దేశంలో మైనింగ్ రంగం ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళా సాధికారికతకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలమని అన్నారు. బీహార్ లో రాష్ట్ర ప్రభుత్వం 7,500 కోట్ల రూపాయలతో రూపొందించిన ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనను ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆత్మ గౌరవం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర యోజన, డ్రోన్ దీదీ, బీమా సఖి బ్యాంక్ దీదీ వంటి అనేక కార్యక్రమాలు దేశవ్యాప్తంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మిగ్ -21 యుద్ధ విమానాలు దేశానికి గర్వకారణమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఎన్నో వీరోచిత పోరాటాలకు అవి సాక్షిగా నిలిచాయని చెప్పారు. మిగ్-21 ఫైటర్ జెట్లకు ఛండీగఢ్‌లోని వైమానిక స్థావరంలో ఈరోజు

జరిగిన ఒక కార్యక్రమంలో ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కే. త్రిపాఠి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. 1963లో మిగ్-21లు వాయుసేనలో భాగమయ్యాయని చెప్పారు. వాయుసేనలో దశాబ్దాలపాటు విశేష సేవలందించాయని కొనియాడారు. 1971 నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు పరాక్రమాన్ని చూపించాయని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా దేశ నిర్మాణానికి కారకులైన పోరాట యోధులు, వారసత్వ సంరక్షకులను గౌరవిస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్... 92 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఒడిశాలోని జార్సుగూడ నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 98 వేల సైట్‌లకు BSNL స్వదేశీంగా అభివృద్ధి చేసిన 4G స్టాక్‌ను ప్రారంభించనున్నారు. డిజిటల్ భారత్ నిధి ద్వారా దేశంలో వంద శాతం 4G సంతృప్త నెట్‌వర్క్‌ను కూడా ఆయన ప్రారంభించనున్నారు. ఆ వివరాలను న్యూఢిల్లీలో ఈరోజు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాధిత్య సింధియా పాత్రికేయులకు తెలియజేస్తూ.. దేశవ్యాప్తంగా BSNL 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అధునాతన ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అభివృద్ధి కారణంగా దేశంలో మానవ ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోగలుగుతున్నామని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద రాయ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ 21వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, దేశం తుఫాన్లు ఇతర ప్రకృతి విపత్తుల నుంచి రక్షించుకోగలుగుతోందంటే అధునాతన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలే కారణమని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాలతో ముగిసాయి. ఉదయం 80,956 పాయింట్లతో సెన్సెక్స్ నష్టాల్లో ప్రారంభమై... చివరకు 733 పాయింట్ల నష్టంతో 80,426 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 236 పాయింట్ల నష్టంతో 24,654 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక జట్ల మధ్య దుబాయ్ వేదికగా కొద్ది సేపటి క్రితం ఆసియా కప్ టీ-20 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం అయింది. శ్రీలంక టాస్  గెలిచి బౌలింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ నాలుగు ఓవర్లు పూర్తి అయ్యేసరికి ఒక వికెట్ నష్టపోయి 44 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఛత్తీస్‌గఢ్, కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, విదర్భ, మధ్య మహారాష్ట్ర, కొంకణ్  గోవాలలో రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) తెలిపింది. ప్రస్తుతం వాయువ్య

బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం నెలకొని ఉందని వాతావరణ అధికారి అమిత్ కుమార్ తెలిపారు. ఇది రాబోయే 12 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని చెప్పారు. ఇది పశ్చిమ దిశగా కదిలి రేపటి ఉదయం నాటికి దక్షిణ ఒడిశా -ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని వివరించారు.

==============================
==============================